సాక్షి
గుంటూరు
శుక్రవారం । 22 । మార్చి । 2024



హుండీ లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో హుండీ లెక్కించారు. గురువారం లెక్కించగా రూ. 2,90,730 ఆదాయం వచ్చింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కొండపై కూల్ కూల్‌గా..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిలో భక్తులకు ఇబ్బంది కలగకుండా దుర్గగుడి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ప్రాంగణంలో కూల్ పెయింట్, కాయర్ మ్యాట్లు వేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
గుంటూరు	6.24	4.54
నరసరావుపేట	6.26	4.56
బాపట్ల	6.24	4.54

న్యూస్‌రీల్

ముందస్తు ప్రవేశాలు చేపట్టకండి

ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి నీలావతిదేవి



నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియెట్ 2024–25 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్మీడియెట్ కళాశాలల యాజమాన్యాలు ఎటువంటి ముందస్తు ప్రవేశాలను చేపట్టరాదని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి గురువారం తెలిపారు. ఈమేరకు ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశాలు జారీచేసినట్టు స్పష్టం చేశారు. ముందస్తు ప్రవేశాలు చేపట్టిన కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి పరీక్షలు పూర్తి కాకుండానే మొదటి సంవత్సరం ప్రవేశాలకు కొన్ని కళాశాలలు ప్రయత్నాలు ప్రారంభించటం బోర్డు దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యామండలి త్వరలోనే 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశ షెడ్యూల్‌ను ప్రకటిస్తారని తెలిపారు. బోర్డు ప్రకటించే షెడ్యూల్ ప్రకారమే కళాశాలలు అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. బోర్డు ఆదేశాలను ఖాతరు చేయకుండా షెడ్యూల్ ప్రకటన కంటే ముందుగానే ప్రవేశాలు చేపట్టినట్టు ఫిర్యాదులు వస్తే ఆయా కళాశాలల గుర్తింపు రద్దుకు సిఫారసు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజుకు ఉత్తమ సేవా పతకం



నరసరావుపేట: ప్రతి ఏడాది ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ సేవా పతకానికి పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ(ఏఆర్) డి.రామచంద్రరాజు ఎంపికయ్యారు. గురువారం ఆయనను జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అభినందించారు. దీర్ఘకాలం పోలీస్‌శాఖలో సేవలు అందించే పోలీసులకు ఈ పతకాన్ని ప్రకటిస్తారు. గతంలో అదనపు ఎస్పీకి 2017 సేవా పతకం, 2019లో ఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. జిల్లా పోలీస్ విభాగంలో సౌమ్యునిగా పేరుగాంచిన రామచంద్రరాజుకి ఉత్తమ సేవా పతకం రావడంతో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్



నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, ఆర్డీవో సరోజ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

‘ఆసరా’పై వైద్యులు, సిబ్బందికి శిక్షణ తరగతులు

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో పని చేస్తున్న వైద్యాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆసరా అమలుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవం అయిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య ఆసరా కింద రూ. 5వేలు పారితోషికం అందజేయాలని ఆదేశించారు. డెలివరీ అయిన వారి డాక్యుమెంట్లు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి లక్ష్మీకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ కృష్ణకుమారి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్ పాల్గొన్నారు.

దేశం దమన నీతి

- ఓటమి భయంతో అడ్డదారులు
- దాడులకు వెనుకాడటం లేదు
- ప్రత్తిపాడు అభ్యర్థి ఇంటిపై గూండాయిజమే నిదర్శనం
- ఆదిలోనే మంత్రి, పశ్చిమ అభ్యర్థి రజిని కార్యాలయంపై రాళ్ల దాడి
- సొంత నిధులతో ఏర్పాటు చేసిన బెంచీలు సైతం ధ్వంసం
- గుంటూరు తూర్పులోనూ రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు
- పొన్నూరులో నోరు పారేసుకుంటున్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్



బుధవారం బలసాని ఇంటిపై దాడికి కారులో వచ్చిన టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు

“అమెరికాలో అయితే తమ ఇంటిపైకి ఎవరైనా దౌర్జన్యానికి వస్తే తుపాకీతో కాల్చివేసే వాడినంటూ” టీడీపీగుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం నేతలు బరితెగిస్తున్నారు. ఓటమి భయంతో ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే తమ కుయుక్తులకు శ్రీకారం చుట్టారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడమే కాకుండా దాడులకు కూడా తెగబడుతుండటం విస్మయం కలిగిస్తోంది. ఒక ఐఏఎస్ అధికారిగా పనిచేసి, జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి కూడా చట్టవిరుద్ధంగా తన ప్రత్యర్థి ఇంటిపైకి దాడికి వెళ్లడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ప్రత్యర్థి ఇంట్లో ఏదైనా సమావేశం జరుగుతుంటే పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉండగా దానికి భిన్నంగా ప్రత్యర్థి ఇంటిపైకి 20 కార్లలో తెలుగుదేశం కార్యకర్తల్ని, పచ్చమీడియాను తీసుకుని వెళ్లాల్సిన అవసరం ఏంటో తెలుగుదేశం పార్టీ సమాధానం చెప్పాల్సి ఉంది. అయితే తాము చేసిన దాడిని నిస్సిగ్గుగా సమర్థించుకోవడమే కాకుండా దాడికి గురైన వారిపైనే తిరిగి కేసు పెట్టాలంటూ మళ్లీ గురువారం జిల్లా ఎస్పీని కలవడం వారి బరితెగింపునకు నిదర్శనంగా కనపడుతోంది. పాత ఫొటోలు తీసుకువచ్చి పోలీసులందరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థికి సపోర్టుగా ఉన్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు, వలంటీర్లను భయపెట్టడం ద్వారా తమ పబ్బం గడుపుకోవాలన్న ఆలోచన కనపడుతోంది.

పెమ్మసాని...ఇప్పుడేమంటారు?

అమెరికాలో అయితే తమ ఇంటిపైకి ఎవరైనా దౌర్జన్యానికి వస్తే తుపాకీతో కాల్చివేసేవాడినంటూ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. మరి అదే పార్టీలోని వారు వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇంటిపైకి దాడికి వెళ్లడాన్ని ఎలా సమర్థిస్తున్నారో జనాలకు సమాధానం చెప్పాల్సి ఉంది. మరోవైపు గుంటూరు పార్లమెంట్‌లోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇదే పద్ధతిని తెలుగుదేశం అవలంభిస్తోంది. గుంటూరు పశ్చిమలో కూడా ఇదే విధంగా దాడులకు పాల్పడ్డారు. జనవరి ఒకటిన చంద్రమౌళీనగర్‌లో ప్రారంభానికి సిద్ధమైన మంత్రి రజిని పార్టీ కార్యాలయంపై తెలుగుదేశం, జనసేన అల్లరి మూకలు దాడులకు దిగాయి. ఫ్లెక్సీలు కడితే చింపేశారు. కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తుంటే మంత్రిని అడ్డుకున్నారు. రజిని తన సొంత నిధులతో బెంచీలు ఏర్పాటు చేస్తే వాటిని ధ్వంసం చేశారు. గుంటూరు తూర్పులో కూడా తెలుగుదేశం నేతలు ఇలానే రెచ్చిపోతున్నారు. కావాలని గొడవలకు దిగుతున్నారు. ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాలకు వచ్చి కావాలని రచ్చ చేస్తున్నారు. పొన్నూరులో మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రతిరోజూ తప్పుడు ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. అధికార, ప్రతిపక్షాలు తమ వాదనను వినిపించి ప్రజాతీర్పు కోరాల్సి ఉండగా దీనికి భిన్నంగా తెలుగుదేశం, జనసేన నేతలు దాడులతో భయపెట్టాలని చూస్తుండటం జిల్లాలో చర్చనీయాంశంగా మారుతోంది.

రామాంజనేయులుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

గుంటూరురూరల్: ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఇంటిపై రామాంజనేయులు నేతృత్వంలో 200 మంది టీడీపీ గుండాలు బుధవారం దాడి చేయడంతోపాటు, అభ్యర్థిని చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడిన విషయం విదితమే. ఫిర్యాదు అనంతరం బలసాని మాట్లాడుతూ ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి అయి ఉండి 20 కార్లలో 200 మంది జనసేన, టీడీపీ రౌడీలను తీసుకొచ్చి తనతోపాటు స్థానికంగా ఉన్న కార్యకర్తలను బెదిరించి ఎవరు అడ్డు వచ్చినా చంపేస్తామంటూ భయాందోళనకు గురిచేశారని తెలిపారు. ఆ సమయంలో అడ్డు వచ్చిన నా వ్యక్తిగత అనుచరుడు ఇందిరాబాబు, సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, ఆర్ అండ్ బీ డైరెక్టర్ పిల్లి మేరి, మరో కార్యకర్త రజినీకాంత్‌లను తీవ్రంగా గాయపర్చారన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమించి ఎవరు అడ్డు వచ్చినా చంపేస్తామంటూ బూర్ల రామాంజనేయులే స్వయంగా కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిపైనే దాడులు చేసిన టీడీపీ, జనసేన నాయకులు రేపు సామాన్య ప్రజలకు ఏవిధంగా న్యాయం చేస్తారో సామాన్య ప్రజలు ఆలోచిస్తున్నారని అన్నారు. తమ నివాసంపై కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో దాడులు చేసిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, అతనితోపాటు 20 కార్లలో 200 మంది టీడీపీ కార్యకర్తలపైతగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు.

అనుమానాస్పద లావాదేవీలపై ఆరా

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో అధిక మొత్తాలు, అనుమానాస్పద లావాదేవీల వివరాలు తమకు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన బ్యాంకర్లు, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల వ్యయంలో భాగంగా ఎంపీకి రూ.95 లక్షలు, అసెంబ్లీకి రూ.40 లక్షలు దాటకూడదన్నారు. అంతకు మించిన వ్యయంపై నిఘా ఉంటుందని చెప్పారు. బ్యాంకర్లు ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాలని కోరారు. రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థులు బ్యాంకు లావాదేవీలను ఐటీ అధికారులతోపాటు జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. లక్షకు మించిన లావాదేవీలపై బ్యాంకర్లు దృష్టి సారించాలన్నారు. అభ్యర్థులతోపాటు వారి బంధువుల అకౌంట్లపైనా నిఘా ఉంచాలన్నారు. మద్యం, విలువైన వస్తువుల తరలింపు, ఇతర ప్రలోభాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల జారీ చేస్తారన్నారు. 25 వరకు నామినేషన్లు స్వీకరించి, 26న స్క్రూటినీ జరుగుతుందన్నారు. 29న నామినేషన్ల విత్‌డ్రా చివరి రోజన్నారు. మే 13న పోలింగ్ నిర్వహించి, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయపార్టీలు, నాయకులు పోస్టర్లు, ఫొటోలు తొలగించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పోస్టర్లు కూడా తీసేశామన్నారు. ప్రభుత్వ లేదా నాయకుల నిధులతో నిర్వహించే వాటర్ ట్యాంకులు, అంబులెన్స్‌లపై వారి ఫొటోలు ఉండరాదన్నారు. ఈ ఖర్చులకు సంబంధించి తమ ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తాయన్నారు. ప్రచార పోస్టర్లు, ప్రకటనల మ్యాటర్‌ను ముందుగానే ఎంసీఎంసీ కమిటీ వద్ద అనుమతి తీసుకుని పబ్లిసిటీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఇన్‌కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ లలిత, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహీపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల ‘పచ్చ’పాతమా?



కాకుమానులోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి పేపర్లు అంటించిన దృశ్యం



గ్రామ ప్రధాన కూడలిలోని టీడీపీ కార్యాలయం

- కాకుమానులో కోడ్ నిబంధనలకు నీళ్లు
- కోడ్ ఉల్లంఘనల గురించి తెలిపినా పట్టించుకోని అధికారులు
- ఒక పార్టీకి అధికారులు కొమ్ముకాస్తున్నారని ప్రజల ఆగ్రహం

కాకుమాను: ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ మండల అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కాకుమాను విష్ణాలయం ఎదురుగా ఉన్న వీధిలో ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు పార్టీ కార్యాలయానికి స్టిక్కర్‌లు వేసి కార్యాలయం పేరు, పార్టీ పేరు కనపడకుండా చేశారు. గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న టీడీపీ కార్యాలయం మాత్రం అధికారులకు కనిపించలేదు. దీంతో గ్రామ ప్రజలు ఎన్నికల కోడ్ ఒక్క వైఎస్సార్ సీపీకే వర్తిస్తుందా...అన్ని పార్టీలకు వర్తించవా..అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్, ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లగా విషయం మా దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపి వెంటనే తొలగిస్తామని చెప్పారు. కానీ సాయంత్రం ఆరు గంటల సమయంలో కూడా టీడీపీ కార్యాలయానికి ముసుగు తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు
- డివిజనల్, సబ్ డివిజనల్ అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కె.సంతోషరావు, జయభారత్‌రావు, వనజ

గుంటూరు ఈస్ట్ : నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. పొన్నూరు రోడ్డులోని విద్యుత్‌భవన్‌లో సీఎండీ సంతోషరావు గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలోని డివిజనల్, సబ్ డివిజనల్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత అభివృద్ధికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా డివిజన్‌లకు చెందిన ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు వివరించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు లభించిందని, సకాలంలో విద్యుత్ వినియోగదారులు సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి సమస్యను ముందస్తుగా గుర్తించి మరమ్మతులు చేసి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలన్నారు. వినియోగదారులకు విద్యుత్ సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, అలా చేయలేని పక్షంలో సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కొత్త సర్వీసులు జాప్యం లేకుండా వెంటనే విడుదల చేయాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు, అవగాహన కార్యక్రమాలు చేపట్టి వినియోగదారులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. గుంటూరు, సీఆర్‌డీఏ పరిధిలో అత్యధికంగా విద్యుత్ బకాయిలు పెరిగిపోయాయని, వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని సూచించారు. కాలిపోయిన వైర్లు, పడిపోయిన స్తంభాలు, లూజు కనెక్షన్లు, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని సూచించారు. వేసవికాలంలో లోడు ఎక్కువగా ఉండే సమయాల్లో లోడు బ్యాలెన్సు చేసుకుని ఎక్కువ అంతరాయాలు లేకుండా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.జయభారత్‌రావు, టి.వనజ, జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్లు ఎ.మురళీకృష్ణ యాదవ్, టి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో ఐఎఫ్‌పీ ద్వారా చేస్తున్న బోధనను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్



వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్, ప్రవీణ్ ప్రకాష్

డిజిటల్ భేష్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న డిజిటల్ విద్యా విధానం నిర్వహణ, పాఠశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ నిపుణుల పనితీరును పరిశీలించేందుకు కేంద్ర బృందం పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం సందర్శించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆధ్వర్యంలో బృందం డిజిటల్ విద్యావిధానం జరుతున్న తీరును పరిశీలించింది. పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు డిజిటల్‌గా బోధన చేశారు. పలువురు విద్యార్థులతో మాట్లాడారు. బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. -పెదకాకాని/గుంటూరు ఎడ్యుకేషన్


లిఫ్ట్ గుంతలో పడి చిన్నారి మృతి



అమృత మృతదేహం

గుంటూరురూరల్: అపార్ట్‌మెంట్‌కు నిర్మిస్తున్న లిఫ్ట్ గుంతలో ప్రమాదవశాత్తూ చిన్నారి పడి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పెదపలకలూరు శివారులో నారాయణ పాఠశాలకు వెళ్లే డొంకలో నిర్మాణంలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన సీతారామిరెడ్డి అపార్టుమెంట్‌లో కారంపూడి మండలానికి చెందిన మద్దు అశోక్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో అపార్టుమెంట్ పనుల నిమిత్తం భార్య, బిడ్డలతో కలిసి అక్కడే నివాసం ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో అశోక్‌కుమార్తె అమృత (6) ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ లిఫ్ట్ గుంతలో పడింది. కుమార్తె కనిపించకపోవడంతో చుట్టూ వెతికారు. చివరకు లిఫ్ట్ గుంతలో అమృత కనిపించడంతో మృతదేహాన్ని వెలికి తీసి దగ్గర్లో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి నల్లపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


రేపటి నుంచి లక్ష్మీతిరుపతమ్మ బ్రహ్మోత్సవాలు



పట్నంబజారు: పాత గుంటూరు సుద్దపల్లి డొంకలో వేంచేసియున్న లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి 26వ కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అభివృద్ధి సంక్షేమ సంఘం సభ్యులు పూర్తి చేశారు. 23న గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించటంతో పాటు, అఖండ దీప స్థాపన, గోపూజ, సువాసినీ పూజ, శ్రీకృష్ణ పంచసూక్త, పంచామృతాభిషేకాలు, విష్ణు సహస్ర నామార్చన, మల్లికార్జునస్వామికి రుద్రభిషేకం, బిల్వార్చన, సాయంత్రం 3.16 గంటలకు జలబిందెల ఊరేగింపు, మంగళస్నాన కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు లలితా పారాయణం, కుంకుమార్చన నిర్వహిస్తారు. 24న పవిత్ర పూజ, పంచముఖ ఆంజనేయ స్వామి మన్యుసూక్త పారాయణం, నాగవల్లీ దశార్చన జరపనున్నారు. సాయంత్రం 6 గంటలకు పసుపు, కుంకుమ, గంధం, గాజులతో ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రి 8.46 గంటలకు లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరగనుంది. 25న అన్నదానం ఉంటుందని ఆలయ అభివృద్ధి సంక్షేమం సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందాలని పేర్కొన్నారు.

స్పాట్‌తో ఆన్సర్ స్క్రిప్ట్స్ స్కానింగ్

- ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యూయేషన్‌లో అమలు
- “మార్క్స్ ట్యాబ్లేషన్” విధానం జిల్లాస్థాయికి మార్పు
- జవాబు పత్రాలను దిద్దిన వెంటనే స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో బోర్డుకు పంపుతున్న అధికారులు
- నూతన విధానంతో మరింత ముందుగా ఫలితాలు
- స్కానింగ్ చేసే భారం నుంచి ఇంటర్మీడియెట్‌బోర్డుకు విముక్తి



ఆన్సర్ స్క్రిప్ట్‌ల స్కానింగ్ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియలో ప్రభుత్వం సమూలమైన మార్పులు చేసింది. ఇటీవల పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబు పత్రాల స్పాట్ వాల్యూయేషన్ (మూల్యాంకనం) ప్రస్తుతం జరుగుతోంది. స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల్లో ఆన్సర్ స్క్రిప్ట్‌లను మూల్యాంకనం చేస్తున్న ఎగ్జామినర్లతో పాటు వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న చీఫ్ ఎగ్జామినర్లు విద్యార్థులకు మార్కులను కేటాయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థుల ఆన్సర్ స్క్రిప్ట్‌లకు అన్ని జిల్లాల్లోనూ స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్స్ నడుస్తున్నాయి. జిల్లాల వారీగా స్పాట్ వాల్యూయేషన్ చేసిన ఆన్సర్ స్క్రిప్ట్‌లను ఇంటర్మీడియెట్ బోర్డుకు పంపడంతో అధికారుల బాధ్యత పూర్తవుతోంది. బోర్డుకు వెళ్లిన ఆన్సర్ స్క్రిప్ట్‌లను స్కాన్ చేసి విద్యార్థుల వారీగా రోల్ నంబరు, ప్రశ్నపత్రంతో ఇచ్చిన ప్రత్యేక సీరియల్ నంబరు, బార్‌కోడ్ ఆధారంగా మార్కులను కేటాయిస్తున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు రాసిన లక్షలాది మంది విద్యార్థుల ఆన్సర్ స్క్రిప్ట్‌లను స్కానింగ్ చేసి మార్కులను కేటాయిడం ఒక్క ఇంటర్మీడియెట్ బోర్డు ప్రధాన కార్యాలయంలోనే కేంద్రీకృతమై ఉండటంతో అధికారులకు, ఉద్యోగులకు తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పగలు, రాత్రి విధుల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ మార్కుల వెల్లడిలో జాప్యం నెలకొంటోంది. దీంతో ఈ విషయమై దృష్టి సారించిన ప్రభుత్వం సమూల మార్పులు తెచ్చింది. విద్యార్థుల ఆన్సర్ స్క్రిప్ట్‌లను స్కానింగ్ చేసే ‘‘మార్క్స్ ట్యాబ్లేషన్’’ విధానాన్ని వికేంద్రీకరణ చేస్తూ, జిల్లాల వారీగా స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల్లోనే ఏర్పాట్లు చేసింది. స్పాట్ వాల్యూయేషన్ విధులకు హాజరవుతున్న ఎగ్జామినర్లు వాల్యూయేషన్ చేస్తున్న స్క్రిప్ట్‌లను అదే రోజు స్కానింగ్ చేసి ఆన్‌లైన్ ద్వారా బోర్డుకు పంపుతున్నారు. తద్వారా ఇంటర్మీడియెట్ బోర్డుకు కొండంత భారం నుంచి విముక్తి లభించింది. ఆన్సర్ స్క్రిప్ట్‌లకు స్పాట్ వాల్యూయేషన్ ద్వారా మార్కుల కేటాయింపుతోపాటు అక్కడిక్కడే స్కానింగ్ చేసి ఆన్‌లైన్ ద్వారా బోర్డుకు పంపడంతో వీలైనంత త్వరగా ఫలితాలను ప్రకటించేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి.

పకడ్బందీగా మార్కుల కేటాయింపు

స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియలో భాగంగా బోర్డు ఈ ఏడాది నుంచి కొత్తగా మార్క్స్ ట్యాబ్లేషన్ విధానాన్ని జిల్లాస్థాయిలో అమల్లోకి తెచ్చింది. ఎగ్జామినర్లు దిద్దిన స్క్రిప్ట్‌లను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే వాటిని స్కానింగ్ చేసి, ఆన్‌లైన్‌లో బోర్డుకు పంపుతున్నాం. మార్కుల కేటాయింపులో తప్పులు దొర్లితే, అందుకు బాధ్యులైన ఎగ్జామినర్లకు ఒక్కో తప్పుకు రూ.500 జరిమానా విధిస్తాం. ఆన్సర్ స్క్రిప్ట్‌లను వివిధ దశల్లో క్షుణ్ణంగా పరిశీలించి, నూరు శాతం పారదర్శకంగా మార్కులను నిర్ధారించిన తరువాతే వాటిని ఆన్‌లైన్ విధానంలో బోర్డుకు పంపుతున్నాం. ఎగ్జామినర్ దిద్దుతున్న పేపర్ ఏ జిల్లాలో ఏ విద్యార్థికి చెందనదనే విషయం ఎగ్జామినర్లతోపాటు అధికారులకు సైతం తెలియదు.

– జీకే జుబేర్, ఇంటర్‌విద్య ఆర్ఐవో, గుంటూరు

రూ.78,260ల నగదు స్వాధీనం


తనిఖీలలో పట్టుబడిన నగదు వివరాలు సేకరిస్తున్న అధికారులు

తాడికొండ: తాడికొండ అడ్డ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.78,260 నగదును స్వాధీనం చేసుకొని, ఐటీ అధికారులకు అప్పగించినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్, రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు గురువారం తెలిపారు. ఎస్ఐ వేణుగోపాల్, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన మొగిలి అశోక్ అనే వ్యక్తి కారులో తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకొని, విచారించారు. పెయింట్స్‌కు సంబంధించిన నగదు అని చెప్పినప్పటికీ అందుకు సంబంధించిన రసీదులు చూపించకపోవడంతో ఐటీ అధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రజలు రూ.50 వేలకు పైబడిన నగదు, బంగారం తరలింపునకు సంబంధించిన వ్యవహారాల్లో అందుకు తగిన లావాదేవీల బిల్లులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందిని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి, సిబ్బందికి సహకరించాలని సూచించారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి రాష్ట్ర పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ పదవుల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. జిల్లాకు చెందిన నీలం రాజును పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర సేవాదళ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా బుర్రా వెంకటశివారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన మురుకుట్ల వెంకట సురేంద్రను నియమించారు.

దళితులపై పెత్తందారుల దాడి

- ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటిపైనే దాడి చేస్తే సామాన్యుల పరిస్థితి ఏంటి
- టీడీపీలో మహిళలకు గౌరవం లేదు
- ఆ పార్టీకి ఓట్లు వేస్తే మహిళలను కూడా బయటకు లాగి కొడతారు
- వైఎస్సార్ సీపీ దళిత శ్రేణులు


విలేకరులు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

గుంటూరు రూరల్: దళితులపై దళితులతో టీడీపీ పెత్తందారులు దాడులు చేయిస్తున్నారని వటపల్లి ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. టీడీపీ నాయకులు దళితులను అణగ దొక్కేందుకు.. వారే వెనకుండి దళితులతోనే దాడులు చేయిస్తున్నారన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని ఇదంతా చేయిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ దళితులను ఎన్నడూ గౌరవించింది లేదన్నారు. ఆ పార్టీ నాయకుల కనుసన్నలలో పనిచేస్తున్న బూర్ల రామాంజనేయులు తనతోపాటు ఉన్న దళితుడిపైనే స్వయంగా దాడి చేయటం హేయమైన చర్యని పేర్కొన్నారు. ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి మాట్లాడుతూ.. టీడీపీ నాయకులకు మహిళలంటే కనీస గౌరవం లేదన్నారు. మహిళను అనికూడా చూడకుండా తనపైనే దాడి చేశారంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. స్వయంగా రామాంజనేయులే తనను చెప్పుకోలేని విధంగా దుర్భాషలాడుతూ.. చేతితో నెట్టివేశాడని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మహిళలంటే ఆయనకు ఎంత గౌరవం ఉందో తెలుస్తుందన్నారు. టీడీపీ నాయకులు, చంద్రబాబు సామాజికవర్గం కావాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసానిని బెదిరించాలని రౌడీలను తీసుకుని ఇంటిపైకి వచ్చారన్నారు. దళితులపై దళితులతో దాడలు చేయించాలనే ఆలోచనలో టీడీపీ ఉందని, దళితులు ఆలోచన చేసి ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్ మాట్లాడుతూ.. దళితులను అణగదొక్కేందుకు టీడీపీ కుట్రలు పన్నుతోందని, వాటిని తిప్పికొట్టి, బుద్ధి చెప్పాలని కోరారు. చంద్రబాబుకు ఎప్పుడూ దళితులపై చిన్నచూపేనన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులంతా చంద్రబాబుకు, టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు బండారు శ్రీను, బోరుగడ్డ రజనీకాంత్, పెరికల కృష్ణమోహన్, దారా హేమ ప్రసాదు, రాచకొండ కలిశెట్టి వెంకటరావు, రాంబాబు, భాగ్యరాజు, బుర్రి ప్రకాశ్, మెరిగల రవి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానాన్ని అధిరోహించాలి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి


బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న హేమచంద్రారెడ్డి

మంగళగిరి: విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికతో ఉన్నత స్థానాలను అధిరోహించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో గురువారం కళాశాల 20వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ హేమచంద్రారెడ్డి సభలో మాట్లాడారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి, కుల, మత వివక్షకు తావులేకుండా తోటి వారికి చేయూత అందించినప్పుడే చదువుకు నిజమైన అర్థమన్నారు. ఈ సందర్భంగా టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. వివిధ కార్యక్రమాల్లో విజేతులకు బహుమతులు అందజేశారు. ఉత్తమ విద్యార్థులుగా నిలిచిన బీ ఫార్మసీ నాలగవ సంవత్సరం చదువుతున్న పి.శశాంక, కె.నిహారికను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, నిర్మల విద్యా సంస్థ మదర్ జనరల్ సిస్టర్ జపమాల, కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ యు.శౌరీ, సిస్టర్ ఆల్ఫోన్సా, ఫాదర్ యు.కిరణ్‌కుమార్, సిస్టర్ జాన్ పాల్, సిస్టర్ కె.మరియ సుందరి, జి.నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

సింహ వాహనంపై బ్రహ్మాండ నాయకుడు

- గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉదయం చిన్న శేషవాహనంపై విహరించిన నారసింహుడు


సింహ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామోత్సవంలో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. సింహ వాహనంలో కొలువుదీరిన బ్రహ్మాండ నాయకుడు నృసింహస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి, హారతులిచ్చారు. హింసించే స్వభావం కలవారిని హింసించేవాడు నారసింహుడు. నరులలో సింహం వంటి వాడు. నరసింహ స్వరూపుడైన స్వామి సింహ వాహనోత్సవం తిలకించిన వారికి దుర్మార్గుల వల్ల కలిగే భయం తొలగుతుందని భక్తుల నమ్మకం. అభయాయచ సాధూనాం, సాధు జనులకు అభయాన్నిస్తూ.. దుర్మార్గాన్ని పారద్రోలుటకు స్వామి వారు సింహ వాహనరూఢుడై భక్తులకు దర్శనమిచ్చారు. పక్షుల్లో గరుత్మంతుడు, మృగాల్లో సింహం తానే అని స్వామి వారు చెప్పినట్లు.. అర్చకులు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఉత్సవం సందర్భంగా రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళా వేదిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నరసింహుని వేషాలు, భజనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాల్యవంతం వెంకటకృష్ణమాచార్యులు మనుమలు వ్యవహరించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. ఉదయం చిన్న శేషవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కై ంకర్య పరులుగా దేవతి భగవన్నారాయణ కుటుంబం వ్యవహరించింది.

నేడు హంస, గజ వాహనాలపై స్వామి గ్రామోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గజ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్న శ్రీవారు.. రాత్రి గజ వాహనంపై స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని, కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.


హాజరైన భక్తులు

వైఎస్సార్ సేవాదళ్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేంద్రరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సేవాదళ్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్నాడు జిల్లాకు చెందిన కొప్పుల వెంకట నరేంద్ర రెడ్డి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

12 ఏళ్ల బాలుడిపై లైంగిక దాడి

వెంకటాయపాలెంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

బెల్లంకొండ: బహిర్భూమికి వెళ్లిన 12 ఏళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కూలీ పనులు చేసుకునేందుకు బాపట్ల జిల్లా సంతమాగులూరు నుంచి వచ్చి వెంకటాయపాలెం గ్రామంలో బాధితుడి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. వారితో మరికొందరు కూలీలు గ్రామంలో ఊరి చివరన గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. కాగా గత సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన బాధిత బాలుడిపై కూలీ పనులకు వచ్చిన ముగ్గురు యువకులు శీలంచర్ల కోటేశ్వరరావు, చందు, కామేశ్వరరావులు లైంగిక దాడికి పాల్పడ్డారు. విషయాన్ని బాధితుడు కుటంబ సభ్యులకు చెప్పడంతో స్థానికులు లైంగిక దాడికి పాల్పడిన వారిని కొందరు పిలిపించి మందలించారు. విషయం బయటకు రాకుండా రాజీ చేసి, వైద్య ఖర్చులకు డబ్బులు ఇప్పిస్తామని చెప్పి పంపించారు. కాగా బాధిత బాలుడికి రక్తస్రావం అవుతుండడంతో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. దీంతో లైంగిక దాడి విషయం బయటకు వచ్చింది. మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. లైంగిక దాడికి పాల్పడిన వారు కూడా మైనర్లు కావడంతో వారిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనపై శుక్రవారం దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ, సత్తెనపల్లి డీఎస్పీ గురునాధ బాబు విచారణకు రానున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఫారెస్టు ఆఫీసు ఇన్‌చార్జ్ ఫారెస్టు రేంజర్ వెంకట రమణ పిలుపునిచ్చారు. స్థానిక చెంచు కాలనీలో బుధవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరై ప్రసంగించారు. వాహనాలు, ఫ్యాక్టరీల నుంచి వెలువడే పొగ కారణంగా పర్యావరణానికి ఇబ్బంది అవుతుందని, దీని దృష్ట్యా సామూహికంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అటవీ సంపద కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఆరుగురిని గాయపరిచిన కారు అతివేగం !



యడ్లపాడు: వేగాన్ని నియంత్రించలేక కారు అదుపుతప్పి ఆటో, స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన వృద్ధుడు మత్యనాయక్ గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి స్వగ్రామానికి కుటుంబ సభ్యులు భార్య గోలిబాయి, కుమార్తె పద్మ, మనవడు వినోద్ అతని స్నేహితుడు స్వామియేలు ఆటోలో బయలుదేరారు. మండలంలోని తిమ్మాపురం జాతీయ రహదారి తిరుమల కాటన్ మిల్స్ సమీపంలోకి రాగానే అదేమార్గంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఆటోను వెనుక నుంచి ఢీకొంది. అనంతరం ఆటో పక్కనే వెళ్తున్న స్కూటీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధుడికి తీవ్రంగా, మిగిలిన వారితోపాటు స్కూటీపై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ కొండలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని 108 వాహనం ద్వారా చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాలకు స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమతి లేని టీడీపీ ప్రచార వాహనంపై కేసు


నకరికల్లు పోలీస్‌స్టేషన్‌కు చేరిన టీడీపీ వాహనం

నకరికల్లు: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ టీడీపీ నేతలు మాత్రం వాటిని బేఖాతరు చేస్తున్నారు. ప్రచారం చేసుకునేందుకు కేటాయించిన ప్రచార వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉండగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాత్రం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా యధేచ్ఛగా ప్రచారం చేసుకుంటున్నారు. నకరికల్లు మండలం బాలాజీనగర్ తండా వద్ద బుధవారం రాత్రి ప్రచారంలో ఉన్న టీడీపీ వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గుర్తించారు. వివరాలు అడగడంతో వారి వద్ద ఎలాంటి అనుమతులు లేవు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌ను సదరు వాహనాన్ని తరలించారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ డి.జయమణి మాట్లాడుతూ పార్టీలకు సంబంధించిన ప్రచార వాహనాలకు అనుమతులు లేకపోతే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌ను అమలు చేసేందుకు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో 15–20 టీడీపీ ప్రచార వాహనాలు గ్రామాల్లో తిప్పుతుండగా వాటిలో ఎన్నింటికి అనుమతులు ఉన్నాయన్నది స్పష్టత లేదు.

తిరునాళ్ల నిర్వహణపై ఈసీ స్పందించాలి

పల్నాడు మేధావుల వేదిక కన్వీనర్ సాంబశివరావు

నరసరావుపేట ఈస్ట్: ఎన్నికల కోడ్ పేరుతో పోలీస్‌శాఖ తిరునాళ్ల పట్ల విధిస్తున్న ఆంక్షలతో ప్రజల మనోభావాలు దెబ్బతినటంతో పాటు వేలాది మంది ఉపాధిని కోల్పోతున్నారని పల్నాడు మేధావుల వేదిక కన్వీనర్ కోడూరి సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు, పార్టీల ప్రమేయం లేకుండా తిరునాళ్లను సజావుగా నిర్వహించుకునేలా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను రూపొందించి అమలు చేసేలా పోలీస్ శాఖను ఆదేశించాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల కమిషన్ అధికారికి గురువారం ఈ–మెయిల్ ద్వారా వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో మార్చి నెల నుంచి జూన్ నెల వరకు 100కు పైగా గ్రామాలలో చారిత్రక ఆలయాలతో పాటు గ్రామ దేవతల ఆలయాల్లో వార్షిక తిరునాళ్ల జరపటం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు తిరునాళ్ల సందర్భంగా పలు రకాల వృత్తిదారులు, కళాకారులు, వ్యాపారులు కుటుంబాలకు ఈ నెలలు ఆదాయం ఏడాది పాటు జీవించేలా చేస్తుందని వివరించారు. ఎన్నికల కమిషన్ సత్వరం స్పందించి తగు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అచ్చంపేటలో బయటపడ్డ టీడీపీ 'వక్రభాష్యం'

- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీకి బలవంతంగా కండువావేసి.. ఫొటోలు తీసి ..
- ఎమ్మెల్యే శంకరరావును ఆశ్రయించి అసలు విషయం బయటపెట్టిన వైనం


అచ్చంపేట ఎంపీటీసీ షేక్ మొహిద్దీన్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: నిన్నా మొన్నటి వరకు నియోజకవర్గం ఎటో కూడా తెలియని టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఎలాగైనా వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులను వశపరుచుకునే కుటిల యత్నాలు మొదలు పెట్టారు. ఇంట్లో ఉన్న వారిని సైతం ఇప్పుడే వెళుదువుగానంటూ తీసుకెళ్లి డబ్బు ఎరచూపి బలవంతంగా మెడలో పచ్చ కండువా కప్పి ఫొటోలు తీసి మా పార్టీలో వచ్చాడంటూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టి ఆనందపడిపోతున్నాడు.

వివరాల్లోకి వెళితే...

అచ్చంపేట–1 ఎంపీటీసీ షేక్ మహిద్దీన్‌ను ఇంటికి బుధవారం సాయంత్రం కొంతమంది టీడీపీ నాయకులు వచ్చారు. 'నీతో పనుంది.. వెంటనే వద్దువు రమ్మనమని' టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన తమ పార్టీలోకి రమ్మంటూ ప్రలోభపెట్టారు. అయినా వినకపోయే సరికి బలవంతంగా టీడీపీ కండువా కప్పి, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. అది చూసుకుని అవాక్కైన సదరు ఎంపీటీసీ మొహిద్దీన్ గురువారం ఉదయాన్నే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వద్దకు వెళ్లి తాను వైఎస్సార్ సీపీలోనే ఉన్నానన్నారు. ప్రాణం పోయినా వైఎస్సార్ సీపీని వీడేది లేదని, టీడీపీ వారు తమ పార్టీలోకి రావాలంటూ బలవంతంగా పచ్చ కండవా వేసి ఫొటోలు తీశారంటూ ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. తిరిగి ఎమ్మెల్యే చేత వైఎస్సార్ సీపీ కండువా కప్పించుకున్నారు.

టీడీపీవి చీప్ పాలిటిక్స్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ టీడీపీవారు అధికారంలో ఉండగా నియోజకవర్గంలో ఏంచేశారో, ఇకపై ఏంచేస్తారో చెప్పుకునే ధైర్యంలేక ఇలాంటి చీప్ పాలిట్రిక్స్ ప్లే చేస్తూ ప్రజలలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో అలజడులు సృష్టిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కానీ ప్రజలెవ్వరూ టీడీపీ మాటలు నమ్మే పరిస్థితులలో లేరని, గత 5 సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి జరిగింది, ఎవరెవరికి ఎన్ని సంక్షేమ ఫలాలు అందాయో అందరికీ తెలుసునన్నారు. మంచి చేసే వారిని వదులుకునేందుకు ఎవరూ సిద్ధంగా లేరని, మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగసాని బాబు, అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, వ్యవసాయ యూనివర్శిటి మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, రవి, ఈపూరి శ్రీనివాసరెడ్డి, విప్పర్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

తప్పు తెలుసుకుని తిరిగొచ్చాం

అమరావతి: ప్రలోభాలకు లోనై గురువారం ఉదయం టీడీపీలో చేరిన అమరావతి గాజులపాలెం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సాయంత్రానికి తమ తప్పు తెలుసుకుని మళ్లీ సొంత గూటికి చేరారు. గురువారం సాయంత్రం క్రోసూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఓర్సు రవి, దేవాళ్ళ పవన్, పల్లపు రాజు, బండారు కోటేశ్వరరావులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈసందర్భంగా ఓర్సు రవి మాట్లాడుతూ మా కాలనీకి చెందిన ఓ వ్యక్తి మభ్యపెట్టి మీటింగ్ ఉందని తీసుకువెళ్లి టీడీపీ కండువాలు కప్పించారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలమైన తమను ఇష్టం లేకుండానే టీడీపీలో చేర్చారన్నారు. నిజం తెలుసుకొని ఇవాళ మళ్లీ పార్టీలోకి తిరిగి వచ్చామన్నారు. టీడీపీ నేతలు ఇలాగే మరికొంత మందిని ప్రలోభాలకు గురిచేయడానికి చూస్తున్నారని ఎవరూ నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, కోపూరి వెంకటేశ్వరరావు, నందూరు కరుణకుమార్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
శుక్రవారం ॥ 22-3-2024

యువర్స్

● గేమింగ్

వేయి కన్నుల శత్రువు వేట



హొరైజన్ జీరో డాన్ (2017) గేమ్‌కు సీక్వెల్‌గా వచ్చిన యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్ హొరైజన్ ఫర్‌బిడెన్ వెస్ట్(పీసీ) విడుదలైంది. థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడే గేమ్ ఇది. ప్రమాదకరమైన ఆయుధాలతో నిండిన 'అలోయ్' అనే హంటర్‌ను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. నోరా తెగకు చెందిన యంగ్ హంటర్ అలోయ్ శాస్త్రవేత్త ఎలిజబెత్ సోటెక్ క్లోన్. 'మిస్టీరియస్ ప్లేగ్' మూలాన్ని తెలుసుకోవడానికి తన బృందాన్ని ఫర్‌బిడెన్ వెస్ట్ అని పిలవబడే సరిహద్దు ప్రాంతానికి తీసుకువెళుతుంది. అలోయ్ తన ప్రయాణంలో భారీ తుఫానులను, సంచార తెగలతో యుద్ధాలను ఎదుర్కొంటుంది. పచ్చనిలోయల నుంచి శిథిలమైన నగరాల వరకు అలోయ్ ప్రయాణంలో ఎన్నో దృశ్యాలు కనిపిస్తాయి. గత గేమ్‌తో పోల్చితే ఈ గేమ్ మ్యాప్ పెద్దగా ఉంటుంది. షీల్డ్ వింగ్, ఫోకస్ స్కానర్, డైవింగ్ మాస్క్, పుల్‌కాస్టర్‌లాంటి టూల్స్‌ను కంబాట్‌లో ఉపయోగించవచ్చు.

● ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5,
● విండోస్ జానర్: యాక్షన్, అడ్వెంచర్ ● మోడ్: సింగిల్-ప్లేయర్


● అదర్‌సైడ్

సామాజిక సేవ నుంచి సైన్స్ వరకు

బెంగళూరుకు చెందిన సియా గోడికా పేరు వినిపించగానే 'సోల్ వారియర్స్' గుర్తుకు వస్తుంది. 'సోల్ వారియర్స్' స్వచ్ఛంద సంస్థ ద్వారా పేదలకు పాదరక్షలను అందిస్తుంది సియా. 'చేంజ్‌మేకర్'గా గుర్తింపు పొందిన సియా గోడికా చదువులోనూ ప్రతిభ చూపుతోంది. 'ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్' గురించి ఆమె చేసిన సైన్స్ వీడియో 'బ్రేక్‌త్రూ జూనియర్ చాలెంజ్'లో బహుమతి గెలుచుకుంది. సైన్స్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి క్రియేటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఇచ్చే ప్రైజ్ ఇది.



● సియా గోడికా



సేవామార్గంలో ప్రయాణించడంతో పాటు క్రియేటివ్ థింకింగ్ కోసం పుస్తకాలు ఎక్కువగా చదువుతుంటుంది సియా. సైన్స్‌కు సంబంధించిన సరికొత్త విషయాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుంటుంది.


'ఇంట్లో పిల్లలకు ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటే గొప్ప విజయాలు సాధించవచ్చు' అని చెప్పడానికి సియా ఒక ఉదాహరణ.

సేవాకార్యక్రమాలకు తమ వంతుగా సహాయపడడం నుంచి సైన్స్ సంగతులు చెప్పడం వరకు సియా గోడికాకు ఎన్నో రకాలుగా ఆమె తల్లిదండ్రులు సహకారం అందించారు.

● స్పేస్ టెక్ స్టార్టప్

అంతరిక్షంలో అగ్నిసంతకం





● శ్రీనాథ్ రవిచంద్రన్ ● మోహిన్

ఏరో స్పేస్ టెక్నాలజీ అనగానే విదేశాల వైపు చూసే ఎంతో మందికి మన సత్తా చూపించిన స్టార్టప్‌లలో 'అగ్నికుల్ కాస్మోస్' ఒకటి. ఆకాశమంత కలతో బయలుదేరిన 'అగ్నికుల్' అమ్ముల పొదిలో దివ్యాస్త్రం అగ్నిబాణ్....

'అగ్నికుల్' అంటే భారత అంతరిక్ష రంగంలో ఆత్మనిర్భర్ విజయగాథ.

ఐఐటీ-మద్రాస్ కేంద్రంగా పని చేస్తున్న 'అగ్నికుల్ కాస్మోస్' త్రీడీ ప్రింటెడ్ రాకెట్ ఇంజిన్‌ను తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రశంసలు అందుకుంది. స్నేహితుడు మోహిన్, ప్రొఫెసర్ చక్రవర్తిలతో కలిసి 2017లో 'అగ్నికుల్'ను లాంచ్ చేశాడు శ్రీనాథ్ రవిచంద్రన్. మన దేశంలోని ఫస్ట్ ప్రైవేట్ స్మాల్ శాటిలైట్ రాకెట్ 'అగ్నిబాణ్'ను నిర్మించింది అగ్నికుల్. 30 కిలోల నుండి 300 కిలోల బరువు ఉన్న పేలోడ్‌ను తక్కువ భూకక్ష్యలోకి (సుమారు ఏడువందల కిలోమీటర్ల ఎత్తు) తీసుకువెళ్లే సామర్థ్యం దీని సొంతం. 2020లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారతీయ కంపెనీగా ప్రత్యేకత సాధించింది అగ్నికుల్. ఒప్పందం ద్వారా 'అగ్నిబాణ్' నిర్మాణంలో 'ఇస్రో' సహాయ, సహకారాలను తీసుకుంది.

ప్లగ్-అండ్-ప్లే ఇంజిన్ కాన్ఫిగరేషన్ సామర్థ్యం ఉన్న అగ్నిబాణ్, మిషన్ అవసరాలకు ఖచ్చితంగా సరిపోయేలా కాన్ఫిగర్ చేయగలదు. ప్రతి క్లయింట్‌కు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కాన్ఫిగర్ చేయవచ్చు. 3డీ సాంకేతికతతో రూపొందించిన ఈ రాకెట్ ఉపగ్రహ ప్రయోగాల ఖర్చును తగ్గిస్తుంది.

మొదట్లో వారానికి కనీసం రెండు రాకెట్ ఇంజిన్‌లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ఆ తరువాత నాలుగు ఇంజిన్‌లకు విస్తరించింది అగ్నికుల్. ఒక్కో అడుగు వేస్తూ ముందుకు వెళ్లింది.

'మోర్ యాక్సెసబుల్ అండ్ అఫర్డబుల్' లక్ష్యంతో బయలు దేరిన శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి రెడీ అవుతున్నారు.



● శ్రీనాథ్ రవిచంద్రన్ 'అగ్నికుల్' కో-ఫౌండర్, సీయివో

ఆత్మవిశ్వాసమే అద్భుత శక్తి

2017లో 'అగ్నికుల్'తో శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఇన్వెస్టర్‌ల నుంచి విశ్లేషకుల వరకు 'మన దేశంలో ఇది సాధ్యమా? ఈ కుర్రాళ్ల వల్ల అవుతుందా' అనే అనుమాన నీడ ఉండేది. అయితే శ్రీనాథ్, మోహిన్‌లు ఎప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఆత్మవిశ్వాసం అనే అద్భుతశక్తితో ముందుకు కదిలారు. నాలుగు వందల వరకు పిచ్ మీటింగ్‌లు నిర్వహించిన తరువాతే ఫస్ట్ రౌండ్ ఫండింగ్ 2018లో వచ్చింది. అనుమాన నీడ వెనక్కి వెళ్లి 'అగ్నికుల్' పేరు ప్రపంచానికి పరిచయం కావడానికి ఎంతోకాలం పట్టలేదు. మన దేశంలో స్పేస్ టెక్ స్టార్టప్‌ల విజయాన్ని దృష్టిలో పెట్టుకొని 'ఏరోస్పేస్ డిగ్రీలు చేయడానికి చాలామంది విదేశాలకు వెళ్లాలనుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక్కడే ఉండాలనుకుంటున్నారు' అంటున్నాడు 'అగ్నికుల్' కో-ఫౌండర్, సీయివో శ్రీనాథ్ రవిచంద్రన్.

● శ్రీహరి కోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈరోజు లాంచ్ చేయాల్సిన 'అగ్నిబాణ్' సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది.

English Idioms

కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్

ప్లాన్, ఇంటెన్షన్, ఇన్‌ఫర్‌మేషన్‌లను రహస్యంగా ఉంచే సందర్భంలో వాడే మాట... కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్.
ఉదా: ది చిల్డ్రన్ డిడ్ నాట్ నో వేర్ దే వర్ టు గో ఫర్ దెయిర్ ఫ్యామిలీ హాలిడే ట్రిప్. దెయిర్ డ్యాడ్ కెప్ట్ హిజ్ కార్డ్స్ క్లోజ్ టు హిజ్ చెస్ట్.

పుష్ ది బోట్ ఔట్

సెలబ్రేషన్ లేదా ఏదైనా కార్యక్రమం కోసం డబ్బును కుమ్మరించే సందర్భంలో వాడే మాట... పుష్ ది బోట్ ఔట్
ఉదా: లెట్ అజ్ పుష్ ది బోట్ ఔట్ అండ్ సెలబ్రేట్ ది విన్ విత్ ఏ ఫ్యాన్సీ డిన్నర్ నైట్

● టెక్... టాక్

ఆసూస్ జెన్‌ఫోన్ 11 ఆల్ట్రా



డిస్‌ప్లే	:	6.78 అంగుళాలు
రిజల్యూషన్	:	1080X2400 పిక్సెల్స్
మెమోరీ	:	256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్
ఓఎస్	:	ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా	:	32 ఎంపీ
బ్యాటరీ	:	5500 ఎంఏహెచ్
బరువు	:	224 గ్రా.

హానర్ వాచ్ జీఎస్ 4



● హార్ట్ రేట్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్, స్ట్రెస్ అండ్ బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ మెజరింగ్‌లాంటి హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ఫీచర్‌లు ఉన్నాయి ● 100 ప్లస్ ఇండోర్ అండ్ ఔట్‌డోర్ మోడ్స్, కస్టమ్ స్పోర్ట్స్ మోడ్స్, 10 ప్లస్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ మోడ్స్‌ను సపోర్ట్ చేస్తుంది.
● రిజల్యూషన్: 466X466 పిక్సెల్స్ ● స్టోరేజ్: 4జీబి
● 5 ఏటీయం వాటర్ రెసిస్టెంట్ ● 32 ఎంబీ ర్యామ్

బింగ్ ఏఐ హోలీ చిత్రాలు

ఆకట్టుకునే ఇమేజ్‌లతో ఫ్రెండ్స్‌కు హోలి శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే... మైక్రోసాఫ్ట్ వారి 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'ను ఉపయోగించి 3డీ హోలీ థీమ్ ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు. సింపుల్ ప్రాంప్ట్స్ ద్వారా 'బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్'పై హోలి ఇమేజ్‌లు క్రియేట్ చేయవచ్చు. వీటిని ఆండ్రాయిడ్ అండ్ ఐఓఎస్, డెస్క్‌టాప్‌లతో యాక్సెస్ చేయవచ్చు. జెనరేట్ అయిన ఇమేజ్‌లు మీకు అంతగా నచ్చకపోతే 'మేక్ దెమ్ మోర్ కలర్‌ఫుల్ అండ్ వైబ్రంట్' 'మేక్ దెమ్ డిటేయిల్డ్' 'మేక్ దెమ్ లుక్ ఫోటో-రియలిస్టిక్' లాంటి ప్రాంప్ట్స్ ఇవ్వవచ్చు.



ఇమోజీ రియక్షన్ ఫీచర్

కమ్యూనికేషన్‌ను మరింత సులభతరం చేయడానికి 'గూగుల్ మెసేజెస్' చాట్స్‌లో ఇమోజీ రియాక్షన్ ఫీచర్ తీసుకువచ్చింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఐమెసేజ్‌లలో మాదిరిగానే ఈ ఫీచర్‌ని ఉపయోగించవచ్చు. రియాక్షన్ ఇమోజీ జోడించడానికి పర్టిక్యులర్ ఎస్‌ఎంఎస్‌ను లాంగ్ ప్రెస్ చేస్తే ఇమోజీ మెనూ కనిపిస్తుంది. దీని నుంచి మనకు కావలసిన ఇమోజీని సెలెక్ట్ చేసుకోవచ్చు. థమ్స్ అప్, రెడ్ హార్ట్, లాఫింగ్ ఇమోజీ, థమ్స్ డౌన్, క్రైయింగ్ ఫేస్‌లాంటి పది ఇమోజీ క్యారెక్టర్లు ఇందులో ఉంటాయి.



సినిమా

తగ్గేదే లే!



● అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్‌ని ఫాలో అయ్యేవారి సంఖ్య (ఫాలోవర్స్) 25 మిలియన్స్‌కు చేరుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంతమంది ఫాలోవర్స్ ఉన్న తొలి దక్షిణాది నటుడిగా అల్లు అర్జున్ రికార్డ్ సృష్టించి, తగ్గేదే లే అంటున్నారు. 'పుష్ప: ది రైజ్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. అదే విధంగా ఆ మూవీకి ఉత్తమ నటుడి కేటగిరీలో తెలుగులో జాతీయ అవార్డు సాధించిన తొలి హీరోగా అరుదైన ఘనత సాధించారాయన. కాగా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు సినిమా, వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటారు అల్లు అర్జున్. అందులో భాగంగానే దక్షిణాదిలో అత్యధిక ఇన్‌స్టా ఫాలోవర్స్ ఉన్న హీరోగా రికార్డ్‌ను క్రియేట్ చేశారు. ఆ తర్వాతి స్థానంలో హీరో విజయ్ దేవరకొండ (21.3 మిలియన్లు), మూడో స్థానంలో హీరో రామ్ చరణ్ (20.8మిలియన్లు) ఉన్నారు.

భాగ్యనగరంలో పూర్తి



● కీరవాణి, త్రిష, చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. 'బింబిసార' చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్న వశిష్ఠ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 'స్టాలిన్' (2006) వంటి హిట్ మూవీలో జోడీగా నటించిన చిరంజీవి-త్రిష 'విశ్వంభర' మూవీ కోసం రెండోసారి కలిశారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రం నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన 'విశ్వంభర' షెడ్యూల్ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. చిరంజీవి, త్రిషతో పాటు ప్రధాన తారాగణం పాల్గొన్న ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించినట్లు యూనిట్ పేర్కొంది. ''ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర'. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ మూవీ ఉంటుంది. 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే.. చిరంజీవి నివాసంలో చిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా యూనిట్‌తో దిగిన ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో షేర్ చేసి, 'ఇదొక లెజెండరీ, అద్భుతమైన రోజు! విశ్వంభర' అని పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి కెమెరా: ఛోటా కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ శబరీష్, లైన్ ప్రొడ్యూసర్: రామిరెడ్డి శ్రీధర్ రెడ్డి.

కాంబినేషన్ రిపీట్



● రామ్‌చరణ్

'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ కానుందని టాక్. హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ 'రంగస్థలం' (2018). కాగా రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయట. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడి కానుందని తెలిసింది. 'రంగస్థలం' సినిమాను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని, దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తారని భోగట్టా.

చరణ్ సినిమాలో సంజయ్ దత్?

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక హిందీలో రామ్ చరణ్ చేసిన తొలి చిత్రం 'తుఫాన్'లో సంజయ్ దత్ ఓ రోల్ చేశారు. మరి.. రామ్‌చరణ్, సంజయ్ దత్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

గోదావరి నేపథ్యంలో...

'పలాస 1978' ఫేం రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలీ ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బర దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ- ''మా సినిమాని ఏప్రిల్ 5న రిలీజ్ చేద్దామనుకున్నాం. కానీ డిస్ట్రిబ్యూటర్స్ అడిగిన మేరకు 19న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన చిత్రం 'శశివదనే'' అన్నారు సాయి మోహన్ ఉబ్బర. ''నా 'పలాస 1978' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు రక్షిత్ అట్లూరి. కోమలీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్, సినిమాటోగ్రాఫర్ శ్రీసాయి కుమార్ దారా మాట్లాడారు.



● కోమలీ ప్రసాద్, రక్షిత్ అట్లూరి

అయోమయం.. ఆశ్చర్యం



● 'దో ఔర్ దో ప్యార్' మూవీ పోస్టర్

విద్యాబాలన్, ప్రతీక్ గాంధీ, ఇలియానా, సెంధిల్ రామమూర్తి లీడ్ రోల్స్‌లో నటించిన బాలీవుడ్ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'దో ఔర్ దో ప్యార్'. శీర్ష గుహ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేను వీగన్... పాలతో తయారైన వాటిని తినను (విద్యాబాలన్)', 'మరి.. మీ ఫేస్ వాష్‌లలో మిల్క్ ఉంటుంది కదా (ప్రతీక్ గాంధీ)!', 'మనం డేటింగ్‌లో ఉన్న వారిలా లేము.. నిజంగా భార్యాభర్తలు ఎలా ఉంటారో అలానే ఉంటున్నాం (ఇలియానా)' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. 'ప్రేమ కన్‌ఫ్యూజ్ చేస్తుంది. సర్‌ప్రైజ్ చేస్తుంది' అన్నవి కూడా టీజర్‌లో కనిపించాయి.

గుండెల్లోన.. ప్రేమవాన!

నార్నే నితిన్, నయన్ సారిక హీరోహీరోయిన్లుగా అంజి కంచిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆయ్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'సూఫియానా.. గుండెల్లోన ప్రేమవాన..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. రామ్‌మిరియాల సంగీత సారథ్యంలో శ్రీమణి ఈ పాటకు లిరిక్స్ అందించారు. రామ్ మిరియాల, సమీర భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు.



● నయన్ సారిక, నార్నే నితిన్

మళ్లీ స్పైడర్‌మేన్ వస్తున్నాడు



● స్పైడర్‌మేన్ నో వే హోమ్ పోస్టర్

హాలీవుడ్ సూపర్ హిట్ సూపర్ హీరో 'స్పైడర్ మేన్' మళ్లీ థియేటర్స్‌కు వస్తున్నాడు. స్పైడర్ మేన్ ఫ్రాంచైజీలో ఇప్పటి వరకూ ఎనిమిది సినిమాలు వచ్చాయి. 'స్పైడర్‌మేన్' (2002), 'స్పైడర్‌మేన్ 2' (2004), 'స్పైడర్‌మేన్ 3' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్' (2007), 'ది అమేజింగ్ స్పైడర్‌మేన్ 2' (2014), 'స్పైడర్‌మేన్: హోమ్ కమింగ్' (2017), 'స్పైడర్‌మేన్: ఫార్ ఫ్రమ్ హోమ్' (2019), 'స్పైడర్‌మేన్: నో వే హోమ్' (2021)... ఈ 8 చిత్రాలూ రీ రిలీజ్ కానున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కొలంబియా పిక్చర్స్ వంద సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా 'స్పైడర్‌మేన్' ఫ్రాంచైజీ సినిమాలను రీ రిలీజ్ చేస్తోందని హాలీవుడ్ సమాచారం. ఈ 8 సినిమాలకు సంబంధించి ఓ కామన్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఈ చిత్రాలు కూడా ఏప్రిల్ 15 నుంచి వారానికి ఒక్కొక్కటి చొప్పున జూన్ 3 వరకు విడుదలవుతాయి. ప్రతి చిత్రం కూడా సోమవారమే రీ -రిలీజ్ కానుండటం విశేషం. ఎంపిక చేసిన థియేటర్స్‌లోనే ఈ సినిమాలు రీ రిలీజ్ కానున్నాయి.

ఆ ఒత్తిడి ఎదుర్కొన్నా!

- దర్శకుడు మల్లిక్ రామ్



''డీజే టిల్లు'(2022) సినిమాకి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఎలాగైనా హిట్ కొట్టాలి, వారి అంచనాలు అందుకోవాలనే ఒత్తిడితో 'టిల్లు స్క్వేర్' తీశాను. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందనే నమ్మకంతో రిలీఫ్ అయ్యాను'' అని దర్శకుడు మల్లిక్ రామ్ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ- ''నేను, సిద్ధు, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా... మేమంతా ఈ స్థాయికి రావడం కోసం 12 ఏళ్లుగా కష్టపడుతున్నాం. ఇప్పుడు కలిసి సినిమాలు చేస్తున్నాం. సిద్ధు బాగా నటించాడు. లిల్లీ పాత్రకి అనుపమ నూటికి నూరు శాతం న్యాయం చేసింది. నిర్మాతలు రాధాకృష్ణ, నాగవంశీ, సాయి సౌజన్యగార్లు బడ్జెట్ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. కంటెంట్ గురించి, క్వాలిటీ గురించే ఎక్కువ మాట్లాడారు. ఏ విషయంలో రాజీ పడలేదు.. అందుకే కొన్ని సన్నివేశాలు రీ షూట్ చేశాం. ఒక్కమాటలో చెప్పాలంటే 'డీజే టిల్లు' నచ్చినవారిని 'టిల్లు స్క్వేర్' ఏమాత్రం నిరాశపరచదు. ఇక 'టిల్లు 3'కి అవకాశం ఉందా అంటే.. కొన్ని ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తులో మూడో భాగం ఉండొచ్చు''అన్నారు.